

శ్రీశైలానికి పోటెత్తిన యాత్రికులు

- వైభవంగా శివపార్వతుల కల్యాణం - కనుల విందుగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

మహాశివరాత్రికి శ్రీశైల క్షేత్రానికి యాత్రికుల తాకిడి భారీగా పెరిగింది. తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిస్సాల నుంచి యాత్రికులు తరలివచ్చారు. 3.5 లక్షల నుంచి 4 లక్షల వరకు యాత్రికులు వచ్చారని అధికారులు అంచనా వేశారు. కాలినకడకన వచ్చే భక్తులు ఆత్మకూరు మండలం వెంకటాపురం నుంచి బైర్లూటి, నాగలూటి, పెచ్చెరువు, భీముని కొలను మీదుగా భారీగా శ్రీశైలం చేరుకున్నారు. వివిధ వాహనాలు, ఆర్‌టిసి బస్సుల్లో కూడా వచ్చారు. కైలాసద్వారం, అటకేశ్వరం, పాతాళ గంగ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.



ప్రభోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నవాహక దీక్షతో 11 రోజులపాటు నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు 8వ రోజు బుధవారం శ్రీస్వామి, అమ్మ వార్లకు విశేష పూజలు జరిగాయి. యథావిధిగా యాగశాలలో చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రభోత్సవం, నంది వాహన సేవ, లింగోద్భవకాల మహారుద్రాభిషేకం, పాగాలంకరణ, ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం వంటి కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

ప్రభోత్సవం : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రభోత్సవం నిర్వహించారు. పలురకాల పుష్పాలతో పుష్పాలంకరణ చేశారు. అదేవిధంగా ప్రభోత్సవంలో నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటుల వేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకోయ్యనృత్యం, ముంబాయి డోల్‌దేస్, స్వాగత నృత్యం, వీరభద్ర డోలు, కునిత, జాంజ్‌పథక్ (కర్ణాటక డోలు) కాళికా నృత్యం, జానపద పగటి వేషాలు, నందికోలు సేవ, గౌరవ నృత్యం, తప్పటచిందు, బీరప్పడోలు, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలువిన్యాసం, గిరిజన చెంచు నృత్యం తదితర కళా రూపాలను ప్రభోత్సవంలో ఏర్పాటు చేశారు.

నంది వాహన సేవ: బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న వాహన సేవలో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ, ఆలయ ఉత్సవం నిర్వహించారు.

లింగోద్భవకాల మహారుద్రాభిషేకం : శివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి 10 గంటల నుంచి స్వామి వారికి లింగోద్భవకాల మహా రుద్రాభిషేకం జరిపించారు. 11 మంది అర్చక స్వాములు, వేద పండితులు మహన్యాస పూర్వకంగా రుద్ర మంత్రాలను పఠిస్తుండగా దాదాపు 4 గంటలకు పైగా జ్యోతిర్లింగ స్వరూపుడైన ఈ స్వామివారికి అభిషేకం చేశారు. ఆలయ ప్రాంగణంలోని పవిత్రమైన మల్లికాగుండంలోని జలంతోను, పంచామృతాలతోనూ, పలు ఫలోదకాలతోనూ ఈ అభిషేకం నిర్వహించారు.

పాగాలంకరణ : లింగోద్భవ కాల మహా రుద్రాభిషేకం ప్రారంభమైన వెంటనే పాగాలంకరణ ప్రారంభించారు. బ్రహ్మోవాల్లో జరిగే ఈ పాగాలంకరణకు ఎంతో ప్రత్యేకత ఉంది. మన వివాహాల్లోనూ పెళ్లి కుమారునికి తల పాగా చుట్టడం ఒక సంప్రదాయం. ఈ ఆచారమే శ్రీశైల ఆలయంలో పాగాలంకరణ పేరుతో ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ పాగా స్వామివారి గర్భాలయ విమాన శిఖరం నుంచి ముఖ మండపంపై నుండే నందులను అనుసంధానం చేస్తూ అలంకరిస్తారు. పాగాలను సమర్పించే భక్తులు నియమంతో భక్తిని మేళవించి రోజుకు ఒక మూరచొప్పున సంవత్సరంలో 365 మూరల పొడవుతో ఈ పాగాను నేస్తారు. ఈ పాగాను అలంకరించే వ్యక్తి దిగంబరుడై అలంకరిస్తాడు. దిగంబరుడై పాగను అలంకరించాల్సి ఉన్నందున పాగాలంకరణ సమయంలో ఆలయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు. చిమ్మ చీకటిలో పాగాలంకరణ చేయడం ఎంతో నేర్పుతో కూడుకున్న పని. యథావిధిగా రాత్రి 10 గంటల నుంచి ప్రకాశం జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పృథ్వీ వెంకటేశ్వర్లు తనయుడు పృథ్వీ సుబ్బారావు స్వయంగా తెచ్చిన పాగాతో పాటు ఇతర భక్తులు సమర్పించిన భాగాలతో పాగాలను కూడా స్వామివారికి అలంకరిస్తాడు.

ప్రత్యేక వేదికపై కల్యాణోత్సవం : బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కనులపండువగా జరగనున్న ఈ కల్యాణోత్సవంలో స్వామివారు పట్టు వస్త్రాన్ని ధరించి తలపై ఒకవైపు గంగమ్మను, మరొకవైపు నెలవంకను, మెడలో ఆభరణాలు, నుదుట విభూది రేఖలను, పట్టు వస్త్రాలను ధరించి పెళ్లి కుమారునిగా ముస్తాబు చేశారు. అమ్మవారు కూడా పట్టు వస్త్రాలను ధరించి నుదుట కల్యాణ తిలకాన్ని, బుగ్గన చుక్కను, సర్వాభరణాలను ధరించి పెళ్లి కుమార్తె అయి స్వామికి సరిజోడు అనిపించుకున్నారు. మంగళ తూర్యనాదాలతో, వేదమంత్రాల నడుమ నేత్రానందంగా ఈ కల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా అర్చక స్వాములు కల్యాణోత్సవ సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కల్యాణోత్సవం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ నిర్వహిస్తారు. తర్వాత వృద్ధి, అభ్యుదయాల కోసం పుణ్యాహవచనం చేశారు. తర్వాత కంకణ పూజను, అనంతరం యజ్ఞోపవిత పూజ చేసి స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవితా ధారణ చేస్తారు. అనంతరం సప్తరుషుల ప్రార్థన చేసి కన్యావరణ మంత్రాలు పఠించారు. తర్వాత స్వామివారికి వరపూజను జరిపిస్తారు. అనంతరం స్వామి, అమ్మ వార్ల ప్రవర పఠనాన్ని చేస్తారు. తర్వాత స్వామివారికి మధువర్కం సమర్పించిన శ్రీస్వామి, అమ్మవార్లకు వస్త్రాలను సమర్పించారు. అనంతరం భాషికధారణ చేస్తారు. తర్వాత గౌరీ పూజ నిర్వహిస్తారు. స్వామి, అమ్మవార్ల మధ్య తెరసెల్లెను ఏర్పరిచి మహాసంకల్ప పఠనం చేస్తారు. అనంతరం సుమూర్త సమయంలో స్వామి, అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం సమర్పిస్తారు. తర్వాత మాంగల్య పూజను జరిపించి అమ్మవారికి మాంగల్య ధారణ జరిపించారు. తర్వాత తలంబ్రాలు, బ్రహ్మముడి కార్యక్రమాలను జరిపి భక్తులకు ఆశీర్వచనాన్ని అందజేస్తారు.

కొత్త జిఒ వచ్చే వరకు పోరాటం

- 6వ రోజూ ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయ్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సివిల్ సప్లయ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కూలిరేట్లు పెంచే వరకు పోరాటం సాగిస్తామని సివిసప్లమ్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కృష్ణ, సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎం.రాజశేఖర్ అన్నారు. బుధవారం 6వ రోజూ కర్నూలు సివిల్ సప్లయ్ ఎంఎల్ఎస్ పాయింటు దగ్గర జి.బజారి అధ్యక్షతన నిర్వహించిన ధర్నానుద్దేశించి వారు మాట్లాడారు. సివిల్ సప్లయ్స్ హమాలీ కార్మికులతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అగ్రిమెంట్ ముగిసిపోయి 14 నెలలు అవుతున్నా వారికి పెరిగినటువంటి ధరలు కనుగుణంగా జిఒను విడుదల చేయకుండా కలయాపన చేస్తుందని విమర్శించారు. రెండేళ్లకోసారి అగ్రిమెంటు ప్రకారం పెరిగిన కూలిర్టేను కూడా నామినల్ గా పెంచుతున్నారన్నారు. రూ.మూడు నుంచి రూ.ఐదు వరకు మాత్రమే పెంచుతున్నారన్నారు. కార్మికులకు సరిపోవడం లేదని, ఇప్పుడు ఉన్నటువంటి రేట్ల ప్రకారం చూసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లయ్ హమాలీలకు రూ.30 నుండి రూ.40 వరకు పెంచి ఇస్తే తప్ప వారి యొక్క జీవనం సాగదని అన్నారు. సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందుతుందన్నారు. ఇటీవల పెంచిన కూలిరేట్లు రూ. 25 నుండి రూ.28 సంబంధించిన జిఒను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ హమాలీలు రాష్ట్ర ప్రభుత్వానికి ఎనలేని సేవ చేస్తున్నారన్నారు. ప్రజలకు నిత్యవసర వస్తువులను చేరవేసే దాంట్లో వారి పాత్ర ముఖ్యమైందని ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే పెట్టే హమాలీల పట్ల నిర్లక్ష్యం తగదని ఆయన డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. బోనస్ స్వీట్స్ కుట్టుకూలితో పాటు పెంచి ఇవ్వాలన్నారు. హమాలీల సమస్యలను పరిష్కరించకపోతే త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బజారి సోల్మాన్ రాజు ఆర్.చంద్ర, కర్నూలు ఎంఎల్ఎస్ పాయింట్ యూనియన్ సెక్రటరీ సోలమన్ రాజు, శివ, వినయ్, ప్రకాష్, రమేష్, శ్రీను, ఎం.రాజు, వెంకటేష్ బాలరాజు మహేంద్ర డి.సూరి మద్దిలేటి సుధాకర్ బి దేవరాజు తదితరులు నాయకులు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాజశేఖర్

ఎదురుచూపులే...

- ఉమ్మడి జిల్లాలో 2,645 ఉపాధ్యాయ పోస్టులు
- ఎనిమిది నెలలైనా అమలుకాని తొలి సంతకం

ఐదేళ్లుగా డిఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డిఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం రోజు మెగా డిఎస్సీపై తొలి సంతకం చేశారు. ఎనిమిది నెలలైనా సిఎం తొలి హామీ అమలు కాకపోవడంతో డిఎస్సీ అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,645 పోస్టులను ప్రకటించారు.

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న సమయంలో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తొలి సంతకం చేశారు. దీంతో ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఐదేళ్లుగా డీఎస్సీ నిర్వహించకపోవడంతో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ ప్రభుత్వం విడుదల చేయనున్న డీఎస్సీపై ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా లక్ష మంది వరకూ డిఎస్సీకి అర్హులైన అభ్యర్థులు ఉన్నారు. వైసిపి ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభంలో వదిలిన డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు 1,543 పోస్టులు కేటాయించారు. టిడిపి ప్రభుత్వం విడుదల చేయనున్న మెగా డిఎస్సీలో ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు సమాచారం. ఈ డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలోని 2,645 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేసేందుకు అధికారులు సన్నాహకాలు పూర్తి చేస్తున్నారు. ఎస్‌జిటి 1791, ఎస్ఎ తెలుగు 84 పోస్టులను, ఎస్ఎ హిందీ 113 పోస్టులను, ఎస్ఎ ఇంగ్లీష్ 61, ఎస్ఎ గణితం 89, ఎస్ఎ భౌతిక శాస్త్రం 63, ఎస్ఎ జీవ శాస్త్రం 61, ఎస్ఎ సాంఘిక శాస్త్రం 78, పిఇటి 211 పోస్టులను భర్తీ చేస్తామని ప్రకటించారు. చంద్రబాబు తొలి సంతకంపై తొలి సంతకం చేసి ఎనిమిది నెలలైనా మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. దీంతో డిఎస్సీ అభ్యర్థులకు ఎదురుచూపులు తప్పడం లేదు. వైసిపి ప్రభుత్వం ఇచ్చిన డిఎస్సీకి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎస్‌జిటి పోస్టులకు 19వేల మంది, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదివేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం ఉమ్మడి జిల్లాలో డిఎడ్, బిఎడ్ అయిపోయి ఉపాధ్యాయ పోస్టులకు అర్హులుగా అభ్యర్థులు ఉండే లక్ష మంది ఉన్నారు. కానీ పోస్టులు, పరీక్షపై ఉన్న గందరగోళం, డిఎస్సీ జరుగుతాదో లేదో అనే అనుమానంతో తక్కువ మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టిడిపి ప్రభుత్వం చేపట్టే డిఎస్సీ ద్వారా కనీసం 25వేల పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

ఖాళీలన్నీ భర్తీ చేయాలి



గతంలో పార్లమెంటులో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రకటించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో 39,008 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిఒ 117 రద్దు చేస్తే మొత్తం 50 వేల ఉపాధ్యాయ పోస్టులు అవసరం అవుతుంది. కాబట్టి తక్షణమే పాఠశాలల విలీనానికి సంబంధించిన జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి. అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలి. మొదట దఫా డిఎస్సీలో 25 వేల పోస్టులను భర్తీ చేయాలి. ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 సంవత్సరాలకు తగ్గించాలి. ఇతర శాఖల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలి. మధ్యలోనే ఆగిపోయిన కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీపై ప్రభుత్వం చర్యలు తీసుకొని హోం శాఖలో ఖాళీగా ఉన్న 24 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయాలి. నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చే వరకు నిరుద్యోగ భృతి నెలకు రూ.8వేలు చెల్లించాలి.


- వై.నగేష్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి.

కాల్వబుగ్గలో శివరాత్రి ఉత్సవాలు

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గౌరు చరిత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రముఖ శైవ క్షేత్రం కాలువబుగ్గ రామేశ్వర స్వామి దేవాలయంలో మంగళవారం మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కాల్వ గ్రామం నుండి విచ్చేసిన ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ ఇఒ మద్దిలేటి ప్రత్యేక పూజలను నిర్వహించారు. బుగ్గ రామేశ్వర స్వామి , భ్రమరాంబ దేవిలకు పంచామృత అభిషేకం నిర్వహించారు. రాత్రి యమాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలను చేపట్టారు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి టిటిడి పాలకమండలి సభ్యుడు , టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు వారు ప్రత్యేక పూజలను నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా ప్రభను ఏర్పాటు చేశారు.గురువారం తెల్లవారుజామున మకర లగ్న సమయంలో స్వామి అమ్మవార్లకు దేవస్థానం ఆధ్వర్యంలో కళ్యాణోత్సవ కార్యక్రమానికి చర్యలు తీసుకున్నారు. జాగరణ సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తి పాటలకు సంబంధించి సంగీత విభావరి కార్యక్రమాన్ని ప్రముఖ గాయని మధుప్రియ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం నుండే భక్తులు పెద్ద ఎత్తున దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కాటినేని నారాయణ టిడిపి మండల అధ్యక్షుడు గోవింద్ రెడ్డి, టిడిపి మండల సీనియర్ నాయకులు సిఎస్ సుధాకర్ రెడ్డి చంద్ర పెద్ద స్వామి ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న కర్నూలు ఎంపి కుటుంబ సభ్యులు

శ్రీశైల మల్లన్నను దర్శించుకున్న ఎంపి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన శ్రీశైలం ఆలయాన్ని కుటుంబ సభ్యులతో కలిసి కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు దర్శించుకున్నారు. శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్ల వార్ల దర్శనార్థం ఆలయానికి చేరుకున్న వారికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.. మొదటగా మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్న ఎంపి కుటుంబ సభ్యులు ,తరువాత శ్రీ భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎం.పి నాగరాజు మాట్లాడుతూ మహాశివరాత్రి రోజున శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకోవడం అనందంగా ఉందన్నారు.. అందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ప్రార్థించానన్నారు.

ఆమెకు బోధనంటే ప్రాణం

-ఆప్యాయతల అనురాగవల్లి ఆ చదువుల తల్లి -బోధనకు అంకితమైన కల్పన
- ప్రైవేటుటీచర్ నుంచి హెచ్ఎం దాకా ఉద్యోగ ప్రస్థానం -పలువురు జీవితాల్లో వెలుగులు



ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

మనదేశ సంస్కృతిలో గురువుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. తల్లి తండ్రి తర్వాత అంతటి గొప్ప స్థానం కేవలం ఒక గురువుకు మాత్రమే దక్కుతుంది. జీవితంలో ఎదగాలంటే కేవలం పుస్తకాల పాఠాలు మాత్రమే కాదు జీవిత పాఠాలు అవసరం అన్న సంకల్పాన్ని విద్యార్థుల్లో నింపారు. ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారు. ఎవరో కాదు మన కర్నూలు వాసి విద్యాబుద్ధుల గని ప్రధానోపాధ్యాయులు ఎస్.కల్పన. ఈనెలా ఖరున ఉద్యోగవిరమణ పొందుతున్న నేపథ్యంలో ఆమె గురించి ప్రజాశక్తి ప్రత్యేక కథనం....

ఎస్.కల్పన 1963లో నంద్యాల పట్టణంలో పాణ్యం గఫూర్, వెంకటమ్మలకు జన్మించారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదివారు. ఇంటర్, డిగ్రీ చదువులను నంద్యాలలోని పిఎస్‌సి అండ్ కెవిఎస్‌సి ప్రభుత్వ కళాశాలలో పూర్తి చేశారు. కర్నూలు ప్రభుత్వ బిఇడి కళాశాలలో బిఇడి పట్టాను పొందారు. ఆమె మొదటి నుంచి గణితంలో మక్కువ ప్రదర్శిస్తూవచ్చారు.


ఉద్యోగ ప్రస్థానం : నాన్న కలలను సాకారం చేసే దిశగా కుటుంబంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా లక్ష్యాన్ని ఏమాత్రం విస్మరించలేదు. తొలుత కర్నూలు నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో రూ.150 వేతనంతో తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. భర్త సామాజిక సేవలో పూర్తిగా అంకితమై పనిచేస్తున్న తరుణంలో ఏమాత్రం తాను కష్టాలకు వెరవకుండా ఓవైపు భర్తకు తనవంతు సహకారాన్ని అందిస్తూనే తన ఉద్యోగ జీవితాన్ని నెట్టుకొచ్చారు. భర్త ధనుంజయుడు సహకారంతో 1990లో స్పెషల్ టీచర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించారు. కల్లూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తొలిసారి స్పెషల్‌టీచర్‌గా చేరారు. 1991లో రేగ్యులర్ అయ్యాక పూలతోట, పంచలింగాల, పర్ల గ్రామాలలో పని చేశారు. 2000లో గణిత టీచర్‌గా (ఎస్ఎ)గా పదోన్నతి పొంది, కర్నూలు పెద్ద మార్కెట్ గర్ల్స్ హైస్కూల్, కల్లూరు మండలం, లొద్దిపల్లి, కర్నూలు బి.క్యాంప్ గర్ల్స్‌హైస్కూల్‌లో విధులు నిర్వర్తించారు. 2019లో ప్యాపిలి మండలం, పిఆర్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పదోన్నతి పొందారు. 2023లో క్రిష్ణగిరికి బదిలీపై వచ్చి ప్రస్తుతం అక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈనెల 28న ఉద్యోగ విరమణ పొందనున్నారు. గణితం అంటే చాల మందికి భయం ఆ భయాన్ని పోగొట్టి వారికి గణితం పట్ల ఆసక్తిని కలిగించాలంటే వారితో స్నేహ పూర్వకంగా ఉంటూనే గణితం బోధన చేశారు.

విద్యార్థుల జీవితాల్లో వెలుగులు : ఆమె తన విద్యా బోధనలో ప్రత్యేకతను సంతరించుకుంది. విద్యార్థులకు పాఠాలను అలవోకగా అర్థమయ్యేలా సరళీకరించి బోధించడం ఆమె ప్రత్యేక నైజం. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పాఠాలు నేర్పారు. అంతేకాకుండా విద్యార్థులకు ముఖ్యంగా విలువలు, విద్యాబుద్ధులు క్రమశిక్షణ వంటి జీవిత పాఠాలను బోధించారు. జీవితంలో తమ లక్ష్యాలను అధిగమించేందుకు విద్యార్థులు బలమైన సంకల్ప భావనను ఆమె నూరిపోశారు. ఇప్పటికే ఆమె విద్యార్థులు ఉపాధ్యాయ, ఆర్థిక, పోలీసు, న్యాయ, తదితర అనేక శాఖల్లో ఉద్యోగులుగాను, వివిధ వృత్తుల్లోనూ స్థిరపడ్డారు. ఆమె సేవలను పలువురు కొనియాడుతున్నారు.

ప్రకృతి పట్ల మమకారం: ప్రకృతిని పరిరక్షించడం అంటే ఆమెకు ఎంతో మమకారం. నివాస ప్రాంతాలు పచ్చదనంతో, పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా ఆరోగ్యం, ఆనందం, ఆహ్లాదం లభిస్తాయని బోధించడమే కాకుండా ఆమె విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులతో కలిసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేశారు. తాను పనిచేసిన ప్రతి చోటా మొక్కలను పెంచి ఆ పచ్చని జ్ఞాపకాలను మదిలో నింపుకుని మురిసిపోయే పసి మనసామెది.

తన భర్తే తన విజయం : తను సాధించిన ప్రతి విజయం వెనక తన భర్త ధనుంజయ ఉంటారని ఆమె సగర్వంగా చెబుతారు. ప్రతి విషయంలో తనను ప్రోత్సహిస్తూ, తనకు అండగా ఉంటూ వచ్చారు. సమాజంలో ప్రతిదీ స్వార్థంతో కాకుండా సమాజ హితంగా ప్రతి ఒక్కరూ పాటుపడాలని అప్పుడే సమాజం వర్ధిల్లుతుందని విశ్వసిస్తారన్నారు. అలాంటి భర్తను పొందడం తన అదృష్టంగా భావిస్తున్నాను.

మమ్మల్ని అమ్మలా చూసేది



- నాగ శివ లింగన్న, చార్టెడ్ అకౌంట్,విద్యార్థి

తల్లిదండ్రులను వీడి కల్లూరు మండలం లొద్దిపల్లె హాస్టల్లో చదువుతున్న మమ్మల్ని ఓ అమ్మలా ఆదరించేది. ఏ విషయాన్నయినా చిరునవ్వుతో స్వీకరించాలని చెప్పిన ఆ మాటలు నా నిత్యజీవితంలో అనుసరిస్తూనే ఉన్నా. ఎలాంటి ఒత్తిడిలో ఉన్నా ఆమెతో మాట్లాడితే ఇట్టే ఉపశమనం లభిస్తుంది. నా జీవితమంతా ఆమెకు రుణపడి ఉంటాను.

ఆమె స్ఫూర్తితోనే టీచర్‌నయ్యా



- హిమబిందు, టీచర్, విద్యార్థి

ప్రతి పాఠాన్ని ఆమె అంకిత భావంతో బోధించేవారు. విద్యార్థులను చిరు నవ్వులతో పలకరించి అర్థమయ్యేలా అత్యంత సరళంగా బోధించేవారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో ముందుకు సాగాలని చెప్పేవారు. ఆమె స్ఫూర్తితోనే టీచరునయ్యాను.

బోధన అంటే ప్రాణం



- దొడ్డ ధనుంజయ, కల్పన భర్త,

విద్యార్థులకు బోధించడం అంటే ఆమెకు ఎంతో ప్రాణం. వృత్తిని ఎంతగా ప్రేమించేదో నన్ను అంతగా ప్రేమించేది. కుటుంబంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా అన్నింటినీ సర్దుకుపోతూ వచ్చింది. ఆమె సహనం, వృత్తిపట్ల అంకిత భావం, నిజాయితీ మంచి స్థానాన్ని తెచ్చిపెట్టేలా చేశాయి.



కలెక్టర్ బొకేను అందజేస్తున్న డ్రైవర్స్ సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, తదితరులు

కలెక్టర్ ను కలిసిన డ్రైవర్స్ సంఘం నేతలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆల్ ఇండియా ప్రభుత్వ డ్రైవర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షునిగా నాగేశ్వరరావును ఎన్నుకున్న తరువాత జిల్లా కలెక్టర్ రంజిత్ భాషను డ్రైవర్ల సంఘం నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా స్థాయి నుండి జాతీయ స్థాయికి ఎదగడం గర్వించదగ్గ విషయమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు వెంగల్ రెడ్డి, సిటీ అధ్యక్షులు కాశన్న, క్లాస్‌ఫోర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, ఎపి ఎన్‌జిఒ నాయకులు ప్రభాకర్ రెడ్డి, ప్రభుత్వ వాహన డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు జిల్లా ప్రధాన కార్యదర్శి మక్బూల్, జిల్లా కోశాధికారి గోవిందు, కార్యవర్గ సభ్యులు రమేష్, అంజద్ భాషా, ఎక్బాల్, మనోహర్ తదితరులు కలెక్టర్‌ను కలిశారు.



మాట్లాడుతున్న రవికుమార్

దీర్ఘకాలిక వ్యాధులుండే టీచర్లకు పరీక్ష డ్యూటీ నుండి మినహాయించండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న ఉపాధ్యాయులను పరీక్షా విధుల నుండి మినహాయింపు నివ్వాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్‌పాటి ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో యుటిఎఫ్, కర్నూలు మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో అధ్యక్షులుగా రవికుమార్, ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు జరగబోతున్నాయని, అందులో పాల్గొనే ఉపాధ్యాయులలో ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులుగా ఉన్న వారికి విధులను మినహాయింపు ఇవ్వాలన్నారు. నిర్మాణంలో ఉన్నటువంటి పాఠశాల భవనాలు, పూర్తి చేయుటకు నిధులను విడుదల చేయాలని చెప్పారు. పెండింగులో ఉన్న ఉపాధ్యాయ సమస్యలు త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శి షౌకత్ అలీ, జిల్లా కార్యదర్శి ఎటి తిమ్మన్న, దుర్గాప్రసాద్, సోమన్న ఎడ్విన్‌పాల్, షబ్బీర్, వెంకటేష్, శేషపని తదితరులు పాల్గొన్నారు.




పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బీవీ

రామలింగేశ్వరునికి ఎమ్మెల్యే పూజలు

ప్రజాశక్తి-నందవరం

మండలంలోని గురుజాల గ్రామంలో వెలసిన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి సందర్భంగా శివనామస్మరణతో మార్మోగింది. ఈ వేడుకలో ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శివలింగానికి అభిషేకాలు చేశారు. ఆలయంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని వడ్డించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామలింగేశ్వర స్వామిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆలయంలో మరిన్ని సదుపాయాలు కల్పించాల్సి ఉందని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులు జరిగేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో డిఎస్పి ఉపేంద్ర బాబు, తహసిల్దార్ శ్రీనివాసులు, టీడీపి నాయకులు శివారెడ్డి గౌడ్, రాజేష్ గౌడ్, గురురాజు దేశాయ్, నాగరాజ్ గౌడ్, మిల్లు నారాయణరెడ్డి, ఈరన్న గౌడ్, ధర్మపురం గోపాల్, మాచపురం కాశీం వలి, చిన్న రాముడు, జనసేన పార్టీ నాయకులు ఎల్లప్ప, ఈశ, నాగలదిన్నె జబ్బార్, నాగలదిన్నె ఈరన్న, ఉరుకుంద పాల్గొన్నారు.

రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న సబ్ కలెక్టర్



పూజలు నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సతీసమేతంగా గురజాల శ్రీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, శివలింగానికి అభిషేకాలు చేశారు. ఆలయంలో సదుపాయాలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నందవరం తహశీల్దారు వారి సిబ్బంది, ఆలయ అధికారులు సబ్ కలెక్టర్‌కు స్వాగతం పలికి సన్మానించారు. స్వామివారి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.శ్రీనివాసులు, డిప్యూటి తహశీల్దార్, బి.మహేష్, ఆర్ఐ సుబ్బా రెడ్డి, విఆర్ఓలు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

ఫోటో- కోటకొండ లో పూజలు నిర్వహిస్తున్న శివ స్వాములు

ప్రజాశక్తి -దేవనకొండ

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా దేవనకొండ పరిధిలోని కోటకొండ గ్రామంలో ఉన్న శ్రీఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పార్వతీ పరమేశ్వరులకు విశేష పూజలు, అభిషేకాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. జాగరణ సందర్భంగా శ్రీజ్యోతి స్కూల్ విద్యార్థులు పార్వతీ పరమేశ్వరుల నాటకం, నృత్యంతో అలరించారు. శ్రీలక్ష్మీ కౌలుట్ల చెన్నకేశవ స్వామి దేవాలయం మాజీ ఛైర్మన్ హనుమంత రెడ్డి, కౌలుట్లయ్య స్వామి, రామలింగడు, లక్ష్మణ్ స్వామి, హనుమంతు, నాగరాజు, పరమేష్, గుంటెప్ప, ముని, శివ పాల్గొన్నారు.



దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

శనగ రైతు ఇక్కట్లు...

• ధర పెరుగుతుందని పంట నిల్వ • ధర తగ్గదలతో రైతుల్లో ఆందోళన
• ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తే మెరుగుపడే అవకాశం

ప్రజాశక్తి - హాలహర్వి

శనగ రైతుకు కన్నీరు తప్పడం లేదు. ధర పెరుగుతుందని ఆశించి రైతులు తమ శనగ పంటను గోడౌన్లలో నిల్వ చేసుకున్నారు. అయితే ధర తగ్గడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తే మెరుగుపడే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు...



కళ్లాల్లో ఉన శనగ పంట

పప్పు శనగ ధర మరింత పెరుగుతుందని భావించిన రైతులకు నిరాశ ఎదురైంది. దిగుబడి తక్కువగా ఉండడంతో అమ్మితే గిట్టుబాటు కాదని చాలామంది రైతులు నిల్వ ఉంచారు. ధర పెరిగే సూచనలు కనిపించడం లేదు. గత రబీలో పండిన పప్పు శనగకు మార్కెట్‌లో ఓ మోస్తరు ధర ఉంది. క్వింటాకు రూ.5,600 నుంచి రూ.5,700 ఇచ్చారు. ఈ ధరకు అమ్మితే గిట్టుబాటు కాదని రైతులు పేర్కొంటున్నారు. గతేడాది రబీలో అధిక వర్షాల కారణంగా పప్పు శనగ పంట దిగుబడులు ఆశించిన మేరకు రాలేదు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్లు రావాల్సి ఉండగా, కేవలం 4 క్వింటాళ్లు వచ్చింది. ఈసారి కంది పంట ఎక్కువ మంది రైతులు సాగు చేయడంతో శనగ పంట తక్కువగా విత్తడంతో మంచి ధర వస్తుందని రైతులు భావించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3.3 లక్షల ఎకరాల్లో, కర్నూలు జిల్లాలో 1.42 లక్షల ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. డిసెంబర్ చివరి వరం నుంచి జనవరి చివరి వారం వరకు పంటను కోశారు. గతేడాదితో పోలిస్తే ధర రూ.500 తక్కువగానే ఉంది. క్వింటా రూ.6 వేలకు మించి రేటు వస్తుందని ఆశించారు. దిగుబడులను అమ్మకుండా, గోడౌన్లకు తరలించారు. గత 15 రోజులుగా ధర క్షీణిస్తూ వస్తోంది. వచ్చే నెలలో ఉత్తరాది రాష్ట్రాలు దిగుబడులు చేతికి వస్తాయి. రేట్లు తగ్గే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం పప్పు శనగకు మద్దతు ధర ప్రకటించి రూ.6 వేల మద్దతు ధరతో కొంటే, తమకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనే సరుకుకు ప్రభుత్వం సకాలంలో డబ్బులు చెల్లించదని కొందరు రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఈ దఫా తగ్గిన రేటు

పప్పు శనగకు ప్రస్తుతం మార్కెట్‌లో రూ.5,300 నుంచి రూ.5,500 ధర ఉంది. గతంలో క్వింటా రూ.5,600 నుంచి రూ.5,700 మధ్య ఉండేది. ఈ దఫా రేటు తగ్గింది. దిగుబడి లేదు. చిన్న, సన్నకారు రైతులు వ్యాపారులతో ఉన్న సంబంధాల కారణంగా అమ్ముకున్నారు. కాస్త పెద్ద రైతులు ధర మరింత పెరుగుతుందని భావించి నిల్వ ఉంచారు.

గిట్టుబాటు కాదు..

- శంకర్ రెడ్డి, హాలహర్వి




నేను 8 ఎకరాల్లో పప్పు శనగ పంటను సాగు చేశాను. అధిక వర్షాలతో దిగుబడి తగ్గింది. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. క్వింటాకు కనీసం రూ.6 వేలైనా ధర ఉంటేనే ప్రయోజనం. మార్కెట్‌లో ఇప్పుడున్న ధర గిట్టుబాటు కాదు. ప్రభుత్వం మద్దతు ధరతో కొనాలి.

ప్రభుత్వమే కొనాలి

- సుధీర్ రెడ్డి, హాలహర్వి



అధిక వర్షాలకు పప్పు శనగ పంట ఎకరాలకు ఎకరాలు కుళ్లిపోయింది. అరకొరగా దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేదు. వ్యాపారులు నిర్ణయించిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. మార్కెట్‌లో క్వింటా పప్పు శనగ రూ.5 వేల నుంచి రూ.5,500 ఉంది. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తే రైతు బాగుపడతాడు.



పూజలు చేస్తున్న పీఠాధిపతులు

శైవ క్షేత్రాల్లో మహా శివరాత్రి పూజలు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని శైవ క్షేత్రాల్లో శివునికి విశేష పూజలు నిర్వహించారు. బుధవారం మహా శివరాత్రి సందర్భంగా స్థానిక పాత ఊరులో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజారులు పంచామృతాభిషేకంతో ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులు ఇచ్చారు. శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుబుధేంద్ర తీర్థులు ఆదేశాలతో ఆయన పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్ శ్రీమఠంలో ఉన్న శివలింగానికి మహా రుద్రాభిషేకం చేశారు. శ్రీమఠంలో నిర్వహణలో ఉన్న శ్రీగురు సార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థులు భక్తితో నమక, చమక, వేద మంత్రాలను జపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించారు. స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో శ్రీఅభయాంజనేయస్వామి దేవాలయంలోను భక్తులు శివలింగానికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వపత్రాల సమర్పణతో పూజారులు ఘనంగా పూజలు నిర్వహించారు. మండలంలోని రాంపురం గ్రామంలో వెలసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి విశిష్ట పూజలు నిర్వహించి మంగళ హారతులు స్వీకరించారు. మహా శివరాత్రి సందర్భంగా ప్రతి శివాలయంలోనూ విద్యుద్దీపాలతో అలంకరించి దూప దీప నైవేద్యాలతో అర్చించి గుగ్గిళ్లను ప్రసాదంగా భక్తులందరికీ పంపిణీ చేశారు.

మాజీ ఎంపిటిసి మృతి

ప్రజాశక్తి - ఆస్పరి



మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన కాంగ్రెస్ మాజీ ఎంపిటిసి మాల చిన్న వీరబద్రి (55) గుండె పోటుతో బుధవారం మృతి చెందినట్లు సర్పంచి తిమ్మక్క, వైసిపి నాయకులు బిటెక్ వీరబద్రి తెలిపారు. ఆయన మృతదేహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. వీరబద్రి 1996లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపిటిసిగా పోటీ చేసి విజయం సాధించారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు కృషి చేశారు. మృతునికి భార్య గోవిందమ్మ ఉన్నారు. బజారి, లక్ష్మన్న, నాగేంద్ర, జయన్న, యంకప్ప, బజారీ పాల్గొన్నారు.



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- వీధిలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
- ఒక విద్యుత్ మీటర్‌పై ఆరు షాపులకు కనెక్షన్లు

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామంలో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రజకుల వీధిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. గ్రామంలో గల వైన్ షాపు విద్యుత్ మీటర్ నుంచి పక్కన ఉన్న ఆరు షాపులకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం, తీగలు

నందవరం గ్రామంలో గల విద్యుత్ అధికారులు విద్యుత్ నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రజకుల వీధిలో విద్యుత్ తీగలు కిందికి వాలి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు తెగిపోయి పడిపోతాయోనన్న భయంతో వీధి ప్రజలు జీవిస్తున్నారు. వీధిలో గల ఒక స్తంభం ఇంటిని ఆనుకుని ఉంది. వీధిలో గల చాలా ఇళ్లకు ఈ స్తంభం నుంచే విద్యుత్ అధికారులు కనెక్షన్లు ఇచ్చారు. వీధిలో ప్రజలు మిద్దెలపై బట్టలు ఆరవేయాలన్నా, వర్షాకాలం మిద్దెలపైకి వెళ్లాలన్నా ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామంలో ఉన్న వైన్ షాపు నిర్వాహకులైతే షాపులో గల మీటర్ నుంచి ఏకంగా పక్కన ఉన్న ఆరు షాపులకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. వారి వ్యాపార స్వలాభం కోసం, వారి విద్యుత్ చార్జీలు ఇతరులపై మోపడం కోసం వైన్ షాపు నిర్వాహకులు, విద్యుత్ అధికారుల అండతో పక్కనున్న షాపులకు విద్యుత్‌ను ఇచ్చారు. విద్యుత్ కనెక్షన్లు ప్రమాదకరంగా ఉన్నా, కొంతమంది వ్యక్తులు విద్యుత్‌ను ఇష్టానుసారంగా వినియోగించుకుంటున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. సామాన్యులు కొన్ని సందర్భాల్లో మర్చిపోయి విద్యుత్ బిల్లు కట్టకపోతే వారిపైన అధికారులు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారు. జాలి, దయ లేకుండా విద్యుత్ కనెక్షన్ తొలగించి వెళ్లడం, జరిమానాలు వేసి వసూలు చేయడం చేస్తున్నారు. బిల్లు కట్టలేని వ్యక్తులకు చిన్నపాటి ఇన్ఫర్మేషన్ కూడా ఇవ్వకుండా వారు పొలాలకు వెళ్లిన సమయాల్లో కనెక్షన్లను తొలగించి వస్తున్నారు. రైతులు సాయంత్రం ఇళ్లకు చేరుకొని సేద తీరదామని ఫ్యాన్ వేసుకుంటే ఫ్యాన్ ఎందుకు తిరగడం లేదో తెలియక అయోమయంలో పడి రైతులు బాధపడుతున్నారు. మరుసటి రోజు బిల్లు జరిమానాతో చెల్లించిన తర్వాత 'కనెక్షన్ ఇవ్వండి' అంటూ విద్యుత్ అధికారులను రైతులు అడుక్కోవాల్సిన దుస్థితి దాపరించింది.



వైన్ షాపు నుంచి పక్కనున్న షాపులకు విద్యుత్ కనెక్షన్లు

అధికారులు స్పందించడం లేదు

- చాకలి వెంకటేష్, నందవరం



వీధిలో గల విద్యుత్ సమస్యలపై అధికారులకు చాలాసార్లు విన్నవించాం. ఇప్పటివరకు వారు స్పందించలేదు. నా ఇంటి ముందు విద్యుత్ స్తంభం ఉంది. స్తంభం తీగలు మా ఇంటిని ఆనుకొని ఉన్నాయి. నా ఇంటిపై ఉన్న సెకండ్ ఫ్లోర్‌కు వెళ్లాలంటే తీగలు చేతికి తగులుతున్నాయి. పై ఇంట్లో పడుకోవాలన్నా భయమేస్తోంది. రాత్రి సమయాల్లో కిందికి దిగిరాలేని విధంగా నా ఇంటిని విద్యుత్ తీగలు అల్లుకొని ఉన్నాయి. వర్షాకాలంలో విద్యుత్ స్తంభాన్ని తాకినా ఐరన్ స్తంభం కావడంతో షాక్ వస్తోంది. విద్యుత్ స్తంభం, తీగల వల్ల మా కుటుంబానికి, వీధి ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది.

నమ్మించి నిండా ముంచారు...

• చెత్త బండ్లు లాక్కున్న ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు • బకాయిలు వేతనాలు చెల్లిస్తేనే వాహనాలు అప్పగిస్తామంటున్న డ్రైవర్లు

ప్రజాశక్తి - ఆదోని



నిరసన చేపట్టిన చెత్త బండి డ్రైవర్లు

ఉద్యోగం పేరుతో వేలాది రూపాయలు ముడుపులు తీసుకున్నారని తీరా చూస్తే ఉన్న పని కూడా ఊడిందని ఎలా బ్రతికేది అంటూ చెత్త బండి డ్రైవర్లు ఆందోళనకు గురవుతున్నారు. ఈఎంఐ అమౌంట్ చెల్లించలేదని ఓ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు బండి లాక్కొని వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని తమకు రావలసిన పది నెలల వేతనం చెల్లిస్తేనే బండ్లు అప్పగిస్తామని డ్రైవర్లు చెబుతున్నారు. రెడ్డి ఎంటర్ప్రైజెస్ సంస్థ ద్వారా గత వైసిపి హయంలో చెత్త బండి డ్రైవర్లుగా నియామకం అయ్యారు. అప్పట్లో ఒక్కొక్కరి దగ్గర రూ.50 వేల వరకు ముడుపులు తీసుకున్నారని డ్రైవర్లు చెడుతున్నారు. ఎప్పటికైనా ఉద్యోగ భద్రత వస్తుందని ఆశతో విధుల్లో చేరిన తమకు ప్రభుత్వం మారగానే పక్కన పెట్టడం సమంజసం కాదంటూ ఆవేదన చెందుతున్నారు. ఆదోని మున్సిపాలిటీలో 42 వార్డులకు గాను మొదట్లో 42 చెత్త బండ్లు ఉండేవి. ఇంటింటి చెత్త సేకరణ చేసి డంప్ యార్డ్ లో వేసేవారు అన్నారు. ప్రభుత్వం మారగానే పది నెలలుగా తమ సేవలను వినియోగించకపోవడంతో పక్కన పెట్టారు. గతంలో ఒక్కో బండికి నెలకు రూ.63వేలు స్వచ్ఛ ఆంధ్రకు మిషన్‌కు మున్సిపాలిటీ ద్వారా ఇచ్చేవారు. అక్కడి నుండి రెడ్డి ఎంటర్ప్రైజెస్‌కు జమ కాగా అక్కడి నుండి డ్రైవర్ల ఖాతాకు రూ.12వేల ప్రకారం నెలకు వేతనం ఇచ్చేవారు. ప్రస్తుతం 10 నెలలుగా ఎలాంటి వేతనం ఇవ్వడం లేదు. వేతనాలు అడిగితే మున్సిపాలిటీ ఇవ్వలేదని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారని తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో అయోమయంలో ఉన్నామని డ్రైవర్లు అంటున్నారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ ద్వారా నెలకు మున్సిపాలిటీ భారీగానే కలెక్షన్ వచ్చేది. ఇప్పటికీ చెత్త సేకరణ నిధులు రూ.30 లక్షలు నగదు మున్సిపల్ ఖాతాలో ఉంది. మున్సిపల్ అధికారులు తమ గోడు పట్టించుకోవడంలేదని సంబంధంలేని విధంగా వ్యవహరిస్తున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు జీతాలు వచ్చేలా చూడాలని ఎమ్మెల్యే పార్థసారథి దృష్టికి తీసుకెళ్లినా అసెంబ్లీలో లేవనెత్తామని చెబుతున్నారే తప్ప మున్సిపల్ ఖాతాలో ఉన్న అమౌంట్ ఇవ్వాలని అధికారులకు చెప్పడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 25 బండ్లు అందుబాటులో ఉన్నాయని, తమకు పెండింగ్ వేతనాలు చెల్లిస్తేనే చెత్త బండ్లు అప్పగిస్తామని డ్రైవర్లు చెబుతున్నారు. నెలవారి కంతులు పేరుకుపోతున్నాయని ఎలాగైనా చెత్త బండ్లు స్వాధీనం చేసుకుంటామని ఫైనాన్స్ ఇచ్చిన కంపెనీ వారు చెబుతున్నారు.

పస్తులతో ఉంటున్నాం

- బసవ, డ్రైవర్



ఉద్యోగం అంటే ఎంతో ఆశతో జాయిన్ అయ్యాం వేతనంతోపాటు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కూడా అమలు చేయడం వల్ల ఉద్యోగం ఉంటుందని నమ్మకం కుదిరింది. ప్రభుత్వం మారగానే చెత్త పన్ను రద్దు చేయడం వల్ల తమ సేవలో అవసరం లేదని మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం చేశారు. పది నెలలుగా రావలసిన వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో పస్తులతో ఉంటున్నాము. ఎలాగైనా ప్రభుత్వ స్పందించి పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించాలని కోరుతున్న పట్టించుకునే వారే లేరు.

బండ్లే ఆధారం...

- రంగా, డ్రైవర్



వేతనం బకాయిలు ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు మున్సిపల్ కౌన్సిలర్లను అడగగా కౌశల్ తీర్మానం చేశామని త్వరలోనే బకాయిలు వస్తాయని నమ్మిస్తున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆవరణంలో ఉన్న బండ్లు ఫైనాన్స్ వారు తీసుకువెళ్తే తమకు ఉండే ఆధారం కూడా ఉండదు. మానవత ధృక్పథంతో మున్సిపల్ అధికారులు తమపై కనికరం కూడా చూపడం లేదు. బండ్లు తరలిస్తే అడ్డుకుంటాము తమకు వేతన బకాయిలు చెల్లించే వరకు ఆందోళన చేస్తాం.

ప్రభుత్వానికి విన్నవించాం

- కృష్ణ, ఆదోని మున్సిపల్ కమిషనర్



చెత్త బండ్ల వ్యవహారం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. ప్రస్తుతం చెత్త పన్ను కూడా ప్రభుత్వం రద్దు చేసింది. చెత్త బండ్ల మెయింటినెన్స్ కోసం నిధులు గతంలో ఇచ్చేది. ప్రస్తుతము ఎలాంటి ఆదేశాలు మాకు రాలేదు. చెత్త బండ్ల సేవలు కూడా ఉపయోగించుకోవడం లేదు. ఆ వ్యవహారం తమ పరిధిలో లేదు బకాయలు రావాలని డ్రైవర్లు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళాము. అక్కడినుండి వచ్చే ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటాం.



రోడ్డుపై విరిగి పడిన చెట్టు

ప్రధాన రహదారిపై విరిగిపడిన చెట్టు

- స్పందించని అధికారులు : సిపిఎం

ప్రజాశక్తి - ఆదోని

ప్రధాన రహదారిపై చెట్టుకొమ్మలు విరిగిపడి వాహన రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని, అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు బి.వీరారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడారు. ఆదోని మండలం కడితోట, గణేకల్లు గ్రామాల మధ్యన ప్రధాన రహదారిపై వేపచెట్టు కొమ్మ విరిగిపడిపోయినా అధికారులు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రధాన రహదారిపై ఎదురెదురుగా వాహనాలు అతివేగంగా రాకపోకలు జరుగుతుంటాయని, ఈ రహదారిపై గతంలో అనేక ప్రమాదాలు జరిగాయని తెలిపారు. ఇలాంటి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని, ఈ రహదారిపై ఉదయం ఒక ప్రమాదం జరిగిందని చెప్పారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన అధికారులే ఇంత నిర్లక్ష్యం చేయడం ఏమిటని నిలదీశారు. ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం, అధికారులు బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే సరిజేయాలని డిమాండ్ చేశారు.

ఉచ్చీరప్ప కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని బిల్లేకల్లులో గుడిసె పూర్తిగా కాలిపోయి సర్వం కోల్పోయిన బోయ ఉచ్చీరప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఆ కుటుంబాన్ని ఆయన బుధవారం పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ... గ్రామంలో పనులు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారని తెలిపారు. ఇలా జరగడం బాధాకరం అన్నారు. ఉచ్చిరప్ప కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇచ్చి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య రూ.5 వేలు, బండిమీద వెంకటేశ్వర్ల సేవాసమితి ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం మండల జిల్లా అధ్యక్షులు నాగేంద్రయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, బండమీది వెంకటేశ్వర సేవా సమితి కార్యదర్శి వీరుపాక్షి, ట్రెజరర్ రమేష్, రైతు సంఘం నాయకులు హనుమంతు, శ్రీనివాసులు, సిపిఐ మండల నాయకులు శివన్న, గిడ్డయ్య పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న గిడ్డయ్య



నేమకల్లులో దర్శించుకుంటున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరిలో భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు నిర్వహించారు. శివరాత్రి పండగ సందర్భంగా భోగేశ్వర దేవాలయంలో శివునికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఉపవాసం ఉన్న వారంతా శివుని దర్శించుకున్నారు. చిప్పగిరిలోని గోవిందప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టి, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. నేమకల్లు శివాలయంలో ఉదయం నుంచి మహిళలు శివుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మండలంలోని గ్రామాలు శివనామ స్మరణతో మార్మోగాయి. శివాలయాలన్నీ కూడా విద్యుత్ దీప కాంతులతో అలంకరించారు.